క్లుప్తంగా

లోవ ఆలయంలో పరిశుభ్రతకు యంత్రాలు సిద్ధం



లోవ దేవస్థానంలో పారిశుధ్య యంత్రాలను ప్రారంభిస్తున్న ఈవో విశ్వనాథరాజు

తుని: లోవ దేవస్థానంలో అత్యాధునిక పారిశుధ్య నిర్వహణకు యంత్రాలను కొనుగోలు చేశామని కార్యనిర్వాహణాధికారి విశ్వనాథరాజు తెలిపారు. అమ్మవారి ఆలయం, మండపంలో పారిశుధ్యం కోసం సమకూర్చిన ఆధునిక యంత్రాలను ఆదివారం ప్రారంభించారు. అధునాతన పద్ధతిలో ఆలయ ఆవరణను శుభ్రం చేసేందుకు ఈ యంత్రాలు ఉపయోగపడతాయని విశ్వనాథరాజు అన్నారు.

మేడే వారోత్సవాలకు ఏర్పాట్లు

జగ్గంపేట: మే డే వారోత్సవాలను జయప్రదం చేయాలని ఏపీ రైతు, కూలీ సంఘం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా మండలంలోని రామవరం శివారు రంగవల్లినగర్‌లో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వీరాంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



రైలు నుంచి జారిపడి మృతి చెందిన వ్యక్తి (ఫైల్)

తుని: తుని–గుల్లిపాడు మధ్యలో రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం అందిన సమాచారం మేరకు ఆయన ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. బెంగుళూరు నుంచి గౌహతి వెళుతున్న సూపర్ ఫాస్ట్ రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి పాయకరావుపేట మండలం పీఎల్ పురం వద్ద ప్రమాదవశాత్తూ జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి దగ్గర లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా అస్సాంకు చెందిన వ్యక్తిగా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జాతీయ రహదారిపై టిప్పర్ బోల్తా



బెండపూడి శివారు జాతీయ రహదారిపై బోల్తా పడిన టిప్పర్

తొండంగి: బెండపూడి శివారు జాతీయ రహదారిపై ఆదివారం టిప్పర్ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బెండపూడి వైపు నుంచి కత్తిపూడి వైపు క్వారీ డస్ట్ పౌడర్ లోడుతో వెళ్తున్న టిప్పర్ పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్‌పై బోల్తాపడింది. ఈ ఘటనలో లారీలో ఉన్న డి.దుర్గాప్రసాద్, ఏ.స్వామితోపాటు మరొక వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని అడ్డంకుల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. దీనిపై తొండంగి పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు రైతన్నల చూపు

- పెరిగిన సాగు విస్తీర్ణం
- పచ్చిరొట్ట విత్తనాలపై విస్తృత ప్రచారం
- నేలసారం, పర్యావరణ పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయం దోహదం

గోకవరం: ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించడం ముఖ్యమైన మార్పుగా కనిపిస్తోంది. ముఖ్యంగా నేలసారం, పర్యావరణ పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయం మంచి మార్గం. రసాయన ఎరువులతో ఆహార ఉత్పత్తులు కలుషితమవుతున్నాయి. వీటిని తినడం వలన మానవాళికి ఆరోగ్యానికి చేటు కలుగుతోంది. రసాయన ఎరువులు ధరలు పెరగడంతో సాగు వ్యయం కూడా అధికమై రైతులకు ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదు. ఈ పరిస్థితిని గుర్తించిన రైతులు క్రమేణా పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారు. ఈ కారణంతో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. గోకవరం మండలంలో కొత్తపల్లి క్లస్టర్‌గా 2016–17లో పెట్టుబడి లేని ప్రకతి వ్యవసాయం చేపట్టారు. ప్రారంభంలో 1,057 మంది రైతులతో సుమారు 577 ఎకరాల్లో సాగు చేపట్టగా ఫలితాలు ఆశాజనకంగా ఉండటంతో కొత్తపల్లి, కామరాజుపేట, గంగంపాలెం, తిరుమలాయపాలెం, గుమ్మళ్లదొడ్డి క్లస్టర్లలో ప్రకృతి సాగు చేపట్టారు. ప్రస్తుతం మండలంలో 4,843 మంది రైతులు 5,928 ఎకరాల్లో ప్రకృతి సాగు చేస్తున్నారు. మామిడి, జీడిమామిడి పండ్ల తోటలను 170 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ విధంగా మండలంలో 13 పంచాయతీల్లో 31 మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విధానం అవలంభిస్తున్నారు. వీరిలో అధిక సంఖ్యలో మహిళలు కూడా ఉన్నారు. మండలంలోని వెంకటాపురం, చిన్నూరులో సుమారు వంద మహిళలు ప్రకృతి వ్యవసాయం ద్వారా అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. వీరు పండించిన దిగుబడులను ప్రతి సోమవారం గోకవరం మండల పరిషత్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఈ దిగుబడులను ఎక్కువగా ఉద్యోగులు కొనుగోలు చేయడం విశేషం.



గోకవరంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న రైతులు



గోకవరంలో నవధాన్యాల సాగుపై ప్రచారం నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నవధాన్యాల సాగుతో మేలు

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్–2025లో భాగంగా మండలంలో ప్రస్తుతం నవధాన్యాలయ సాగుపై రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వర్షాకాలం ముందు ఏప్రిల్, మే నెలల్లో పంట పొలాలు ఖాళీగా ఉండటంతో నవధాన్యాలు వేయాలని సూచిస్తున్నారు. ఇందుకోసం 30 రకాల విత్తనాలను పది కేజీల బ్యాగుల్లో ఉంచి రైతులకు అందిస్తున్నారు. పంట పొలాలు ఖాళీగా ఉండకుండా వీటిని చల్లడం ద్వారా భూమిని ఏడాది పంటతో కప్పి ఉంచడం వలన భూమిలోని పోషకాలు, సూక్ష్మజీవులు నేలకు మంచి పోషకాలుగా తయారవుతాయని సూచిస్తున్నారు. తద్వారా పంట దిగుబడి పెరిగే అవకాశం ఉందని, తెగుళ్లు ఆశించవని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చెబుతున్నారు. అలాగే భూమిలేని వారికి పెరటి తోటల్లో ఆకుకూరలు, కాయగూరలు విత్తనాలు సరఫరా చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు సూచనలు



ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించేందుకు వ్యవసాయశాఖ కృషి చేస్తోంది. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు సాగు పద్ధతులపై ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నాం. ప్రస్తుతం రైతులకు నవధాన్యాల సాగుపై ప్రచారం నిర్వహిస్తూ విత్తనాలను సరఫరా చేస్తున్నాం. రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా మంచి ఫలితాలు ఆశించవచ్చు.

– బి.అబ్బులు, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, గోకవరం

ఆశాజనంగా దిగుబడి



కొన్నేళ్లుగా నాలుగు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నారు. వారి సలహాలతోటేటా ఈ వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధిస్తున్నాను. మిగిలిన రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేసి మంచి ఫలితాలు సాధించాలి.

– గ్రంధి శ్రీనివాస్, ప్రకృతి వ్యవసాయ రైతు, పెంటపల్లి

నేడు తుని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

తుని: మున్సిపల్ చైర్మన్, వైఎస్ చైర్మన్ ఎన్నిక సోమవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో జరుగుతుందని కమిషనర్ వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యాన ఈ ఎన్నికలు నిర్వహిస్తారన్నారు. మున్సిపాలిటీలో 30 మంది కౌన్సిలర్లకు గాను ఒకరు చనిపోగా, మరొకరు ఉద్యోగం రావడంతో రాజీనామా చేశారు. ప్రస్తుతం 28 మంది ఉన్నారు. టీడీపీకి వైఎస్సార్ సీపీకి చెందిన 17 మంది కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీకి 11 మంది సభ్యుల బలం ఉంది. ఓటు హక్కు ఉన్న కౌన్సిలర్లను మాత్రమే ఎన్నికకు అనుమతిస్తామని వెంకట్రావు తెలిపారు.

అంధకారంలో తాళ్లూరు కొత్త కాలనీ

గండేపల్లి: తాళ్లూరు కొత్త కాలనీ (బీసీ) వాసులు ఉక్కపోతతో విల విల్లాడుతున్నారు. తరచూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడటంతో చిన్నారులు, వృద్ధులు అవసోపాలు ఎదుర్కొంటున్నారు. అసలే వేసవికాలం కావడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ ట్రిప్ అవుతూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోవడంతో ఫ్రిజ్, గ్రైండర్లు, మిక్సీలు పనిచేయకపోవడంతో వంట చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని మహిళలు అన్నారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినప్పటికీ లో ఓల్టేజీ కారణంగా ఎలక్ట్రికల్ పరికరాలు పనిచేయడం లేదని స్థానికులు అన్నారు. మూడు రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో వీధి దీపాలు వెలగడంలేదని, ఇళ్లకు విద్యుత్ అరకొరగానే ఉంటోందన్నారు. దీనిపై విద్యుత్ అధికారులను వివరణ కోరగా సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

12న మహారణభేరి బహిరంగ సభ



కిర్లంపూడిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

కిర్లంపూడి: మాలల మహారణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. కిర్లంపూడిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద స్థానిక నాయకులతో కలసి మాలల మహారణభేరి పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల 12న పీవీ రావు 73వ జయంతిని పురస్కరించుకుని ఎస్సీ వర్గీకరణ బిల్లును వ్యతిరేకిస్తూ కాకినాడ పీవీ రావు సభా ప్రాంగణం మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో మాలల మహారణ భేరి బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా మాలలు వేలాదిగా చలో కాకినాడ తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లింగ శివకుమార్, బుంగ సతీష్ కుమార్, కండవెల్లి లోవరాజు, మత్ర చిట్టిబాబు, బులుపే గోపి, మద్దా సురేష్, కాకర అప్పారావు, దేవబత్తుల దానియలు, సతీష్, కండెలి రాజు, బొర్ర చినబాబు, యూత్ సభ్యులు ఉన్నారు.

వైభవంగా ఏగులమ్మ జాతర



మర్రిపాకలో బోనాలు తీసుకువెళుతున్న మహిళలు

జగ్గంపేట: మర్రిపాక గ్రామ దేవత ఏగులమ్మవారి 21వ జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. ముందుగా 108 మంది మహిళలు బోనాలు ఎత్తుకుని గ్రామోత్సవం నిర్వహించారు. పిల్లలు, పెద్దలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా గుబ్బాలమ్మ జాతర

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లిలో గుబ్బాలమ్మ తల్లి జాతరను అలయ కమిటీ ఘనంగా నిర్వహించింది. తప్పెటగుళ్లు, సువ్వారాట, తీన్‌మార్, గరగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుబ్బాలమ్మ అమ్మవారిని భక్తులు భారీ ఎత్తున దర్శించుకొని మొక్కులు చెల్లించారు. రాచపల్లి పరిసర గ్రామాల భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి అమ్మవారి జాతరను ఆసక్తిగా తిలకించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు గుబ్బాలమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సారిపల్లి లోవలక్ష్మి, గంగరాజు, పార్టీ నాయకులు పెదిరెడ్డి నానిబాబు పాల్గొన్నారు.



రాచపల్లిలో గుబ్బాలమ్మవారిని దర్శించుకుంటున్న ముద్రగడ గిరిబాబు

కొత్తపల్లిలో నల్లకొండమ్మతల్లికి పూజలు

శంఖవరం: జి.కొత్తపల్లిలో నల్లకొండమ్మ తల్లి జాతరను సర్పంచ్ ఈగల విజయదుర్గ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. జి.కొత్తపల్లి, పరిసర గ్రామాల భక్తులుభారీ ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారిని సుందరంగా అలంకరించారు.

వేసవి ఇంటర్న్‌షిప్‌లో విద్యార్థి ప్రతిభ



శివమణికంఠ

కోటనందూరు: భారత దేశంలోనే అగ్రశ్రేణి ఢిల్లీ యూనివర్సిటీలో వేసవి ఇంటర్న్‌షిప్‌కు విజయనగరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ విద్యార్థి ఎంపికయ్యాడు. కోటనందూరు మండలం కేఈ చిన్నయ్యపాలెంకు చెందిన కే శివమణికంఠ విజయనగరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో బీఎస్సీ బోటనీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. వేసవి ఇంటర్న్‌షిప్‌కు ఆన్‌లైన్‌లో ఢిల్లీ యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకున్నాడు. జన్యుశాస్త్రంలో ప్రతిభావంతుడైన శివమణికంఠను ఎంపిక చేసి యూనివర్సిటీకి సమాచారం ఇచ్చారు. దీంతో మే నుంచి జులై నెలాఖరు వరకూ జరిగే వేసవి ఇంటర్న్‌షిప్‌లో శివమణికంఠ పాల్గొంటాడు. ఢిల్లీ యూనివర్సిటీ జన్యుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ జాగ్రిత్ కౌర్ మార్గదర్శకత్వంలో శివమణికంఠ వృక్షశాస్త్రంలో అత్యాధునిక పరిశోధనలు చేయనున్నాడు. శివమణికంఠ ప్రస్తుతం సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనురుధ్‌కుమార్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నాడు. ప్రతిభ కనబరిచిన శివమణికంఠను సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపక బృందం, తల్లిదండ్రులు అభినందించారు.

ఉగ్రదాడికి నిరసనగా కాగడాలతో ర్యాలీ



ఏలేశ్వరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వ్యాపారులు

ఏలేశ్వరం: పహల్గాన్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ పట్టణంలో ఆదివారం రాత్రి కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. చిన్న వ్యాపారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చౌక్ నుంచి ప్రధాన రహదారి మీదుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గావ్‌లో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఉగ్రవాదుల అంతానికి కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను తామంతా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో అలమండ నాగేంద్రకుమార్, శిడగం శ్రీనివాసరావు, ధనబాబు పాల్గొన్నారు.

సత్యదేవుని కల్యాణోత్సవాలకు విద్యుద్దీపాలంకరణ

- రూ.19 లక్షల వ్యయంతో ఏర్పాటు



మండుటెండలో అన్నవరం పశ్చిమ రాజగోపురంపై నిలబడి విద్యుద్దీపాలంకరణ చేస్తున్న యువకులు



ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథోత్సవం

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు మే 7 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుద్దీపాలంకరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ సారి విద్యుత్ అలంకరణ పనుల కాంట్రాక్ట్‌ను శ్రీకాళహస్తికి చెందిన మాధవయ్య కంపెనీ రూ.19 లక్షలకు దక్కించుకుంది. ఆ సంస్థకు చెందిన సుమారు 40 మంది నాలుగు రోజులుగా విద్యుత్ అలంకరణ పనుల్లో బిజీగా ఉన్నారు. సత్యదేవుని పశ్చిమ, తూర్పు రాజగోపురాలపై విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు. 40 డిగ్రీల పైబడిన ఎండ తీవ్రతను తట్టుకుని ఆదివారం మధ్యాహ్నం మండుటెండలో వంద అడుగుల పైన ఎత్తు ఉండే ఆ గోపురాలపై గంటల తరబడి ఐదుగురు యువకులు నిలబడి విద్యుత్ దీపాలను అలంకరించారు.

కన్నుల పండువగా సత్యదేవుని రథసేవ

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీరవేంకటసత్యనారాయణ స్వామివారి రథసేవ ఆలయ ప్రాకారంలో ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి టేకు రథంపై ప్రతిష్ఠించారు. స్వామి, అమ్మవార్లకు అర్చకులు కంచిబట్ల సాయిరామ్, పరిచారకుడు కొండవీటి రాజా పూజలు చేసిన అనంతరం భక్తుడు వీర్ల రాము రథసేవను ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య, మంగళవాయిద్యాల నడుమ మూడు సార్లు రథంపై ఆలయ ప్రాకారంలో సేవ నిర్వహించారు. సేవ అనంతరం పండితులు స్వామి, అమ్మవార్లకు నీరాజనం ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. వేద పండితులు అర్చకులు పూజలు నిర్వహించారు. నిజామాబాద్‌కు చెందిన సాయిప్రసన్న దంపతులు రూ.2,500 చెల్లించి రథసేవలో పాల్గొన్నారు. వారికి స్వామివారి కండువా, జాకెట్టుముక్క, ప్రసాదం అందజేసి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అర్చక స్వాములు సుధీర్, పరిచారకుడు పవన్ పూజలు నిర్వహించారు.

నేడు ముత్తంగి సేవ: సత్యదేవుడు, అమ్మవారు సోమవారం ముత్యాల కవచాలు (ముత్తంగి సేవ) ధరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కల్యాణోత్సవానికి దేవదాయ శాఖ మంత్రికి ఆహ్వానం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీరవేంకటసత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో మే 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ఆహ్వానించారు. మే 8న తేదీ రాత్రి 9 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆదివారం నెల్లూరులో మంత్రి కార్యాలయంలో కలసి ఈ మేరకు ఉత్సవాల శుభలేఖ అందజేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కత్తిపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో కలిసిన 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



లంపకలోవ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

శంఖవరం: కత్తిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 30 ఏళ్ల అనంతరం కలుసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని పాఠశాల ఆవరణలో ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా వారంతా గడిపారు. చివరగా గ్రూప్ ఫొటో దిగి తమ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు.

పూర్వ విద్యార్థుల సందడి

ప్రత్తిపాడు రూరల్: చదువులమ్మ చెట్టు నీడలో చెట్టాపట్టాలేసుకుని కలసి తిరిగిన బాల్య స్నేహితులు 22 ఏళ్ల తరువాత ఆదివారం కలుసుకుని ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థినీ విద్యార్థులంతా కలుసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులు ప్రస్తుతం గొల్లప్రోలు, కిర్లంపూడి ఎంఈఓలు శివప్రసాద్, చిన్నారావు, ఉపాధ్యాయులు పర్వతం వెంకట్రావు, వాణి, సుబ్బారావు, గంగనాకులు, నాగవేణి, పీఈటీ శ్రీనును వారు పూల మాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని పాఠశాల ఆవరణలో ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.

శిథిలావస్థలో అతిథి గృహాలు

- స్థలాలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



కూలిపోయే స్థితిలో ఉన్న జెడ్పీ అతిథి గృహం

ఏలేశ్వరం: ఒకప్పుడు రాష్ట్రస్థాయి నేతలతో పాటు ఎందరికో ఉన్నతాధికారులకు అతిథ్యమిచ్చిన అతిథి గృహాలు నేడు శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోనే నాథుడే కరువయ్యాడు. వీటి నిర్వహణ పట్ల అధికారుల తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని సుమారు 30 ఏళ్ల క్రితం జెడ్పీ అతిథిగృహం, ఏలేరు అతిథిగృహం నిర్మించారు. సుమారు ఎకరన్నర స్థలంలో జెడ్పీ అతిథి గృహం, సాయిబాబా మెట్టపై ఏలేరు అతిథిగృహం నిర్మించారు. కాలక్రమేణ వీటికి కనీస నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. జెడ్పీ అతిథిగృహం ఎప్పుడు కూలిపోతుందోనని వినియోగించడం లేదు. ప్రస్తుతం పైకప్పు దెబ్బతిని వర్షం కురిస్తే గదులు చెరువులా మారుతున్నాయి. సువిశాలమైన ప్రాంగణంలో తుప్పలు పెరిగి అధ్వానంగా మారింది. ఏలేరు అతిథిగృహం శ్లాబు శిథిలమవడంతో వర్షపునీరు గోడలపై పడడంతో అవి బీటలు వారాయి. దీంతో ఈ భవనం కూలిపోయే స్థితికి చేరుకుంది. భవనానికి కనీసం మరమ్మతులు చేపట్టిన దాఖలాల్లేవు.

వీఐపీలకు నీడ కరవు

అతిథి గృహాలు అందుబాటులో లేకపోవడంతో వీఐపీలకు నీడ కరువైంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు నిలువ నీడలేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణల బారిన అతిథిగృహం

జెడ్పీ అతిథి గృహం ఆక్రమణల బారిన పడింది. దీనికి రెండు మార్గాలు ఉండగా ఒకదానిని మూసివేసి అక్రమంగా ఇళ్లు నిర్మించారు. ప్రహరీని అనుకుని ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ప్రహరీని అనుకుని నిర్మించిన గృహాల కింది భాగంలో పంచాయతీ వాటర్ ట్యాంక్ పైపులున్నాయి. పైపులైన్ల పైనే ఇళ్లు నిర్మించడంతో ఎప్పటికైనా ఇబ్బందులేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే పూర్తిస్థాయిలో అతిథి గృహం ఆక్రమణకు గురవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న ఏలేరు అతిథి గృహం